

ఉచిత న్యాయ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి

సబ్‌జైల్లో ఉన్నటువంటి ఖైదీలు ఉచిత న్యాయ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్‌ఆర్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్. బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి సూచనల మేరకు రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడారు. వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో రాయచోటి సబ్ జైల్ సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రామాపురం : సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి)

గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించి వారి సంక్షేమానికి కృషి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సంబేపల్లి మండలం, దుద్యాల గ్రామం, పెద్దబంగంపల్లెలో రూ.10 లక్షలతో మంజూరైన సిమెంటు రోడ్డు నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పించి వారి సంక్షేమానికి బాటలు వేస్తోందన్నారు. గతంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉన్నాయని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు నిర్మించి వారి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. అనంతరం మంత్రి కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించి సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్ర, మండల టిడిపి నాయకులు మడితాటి రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

రామాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టారని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రామాపురం టౌన్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉన్నాయని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దరమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఇందుకు ప్రతి ఒక్కరు ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజులు, ఎంపిడిఒ జాషువా, టిడిని నాయకులు పట్టాభిరెడ్డి, గాలివీటి సురేందర్‌రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, అంజనారెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, సరస్వతిపల్లి సర్పంచ్ షేక్ మునీర్ బాషా, రామకృష్ణ గౌడ్, వెంకట్రామిరెడ్డి, పప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, రాంబసిరెడ్డి, శివారెడ్డి, ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ సభ్యుడు వెంకటరమణ, నీలకంఠరావుపేట ఉప సర్పంచ్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

చిన్నమండెం : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బోరెడ్డి గారిపల్లెలోని తమ నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా జిల్లాలో ప్రజలు వివిధ సమస్యలపై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి నియోజకవర్గంలో ఆయా ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రజాదర్బార్ కార్యక్రమాల నిర్వహించి ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజులలో జిల్లాలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారులు కూడా భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధ్యతల సమస్యలను మంత్రి స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఎల్‌ఐసిలో నూతన నియామకాలు చేపట్టాలి

- నిరసనలో ఉద్యోగుల డిమాండ్



ఎల్‌ఐసి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎల్‌ఐసిలో ఏడేళ్ల నుంచి 15 వేల మంది ఉద్యోగుల సంఖ్య తగ్గిందని సంస్థ కోసం, పాలసీదారుల కోసం తక్షణం నూతన నియామకాలు చేపట్టాల్సిందేనని ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం రాయచోటి డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.విశ్వనాథ్, డి.ఆదినారాయణరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఎల్‌ఐసి కార్యాలయం ఎదురుగా ఒక గంట సమ్మె నిర్వహించారు. సమ్మెకు వివిధ ఉద్యోగ సంఘాల నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగం రూపురేఖలు మారుతున్న దశలో నూతన తరం పాలసీదారుల ఆకాంక్షల మేరకు పని చేయాలంటే ఉన్నత విద్యావంతులైన హైటెక్ పరిజ్ఞానం ఉన్న యువత నూతన ఉద్యోగులుగా నియమించుకోవాల్సిన అవసరం ఎల్‌ఐసికి ఉందని తెలిపారు. జవాబుదారితనం లేని అవుట్‌సోర్సింగ్ స్థానంలో రెగ్యులర్ నియామకాలు చేపట్టాలన్నారు. యుపిఎస్‌సి తరహాలో ప్రతి సంవత్సరం ఎల్‌ఐసిలో అవసరమైన మేరకు నియామకాలు చేపట్టాలని, దేశంలో ఉన్న 80 శాతం ఎల్‌ఐసి సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న తమ సంఘం ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గుర్తింపు పొందిన సంఘంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంస్థ కోసం పాలసీదారుల కోసం సిబ్బంది విషయాల దృక్పథంతో పనిచేస్తున్న అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం భారత కార్మికోద్యమ చరిత్రలో ఆదర్శప్రాయమైందని అన్నారు. నూతన నియామకాలు కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం సమ్మెకు మద్దతుగా క్లాస్ వన్ ఉద్యోగుల సంఘం వేణుగోపాల్ రాజు, సుధాకర్ రెడ్డి, హుస్సేన్ బాష, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వి. రమణ, యునైటెడ్ ఎలక్ట్రిక్ సిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కె. సుబ్రహ్మణ్యం రాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామానుజులు, పోస్టల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చిన్న ఓబన్న, కార్యదర్శి మేఘనాథ్ రెడ్డి, సంఘీభావం తెలిపారు. ఎల్‌ఐసి మాత్రమే దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైందని ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఎల్‌ఐసి యాజమాన్యం ఏకపక్ష దోరణలు మాని ప్రజాస్వామికంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌ఐసి నాయకులు ఎ. కల్యాణ్, వై. కల్యాణ్, జి గిరిధర్, లక్ష్మయ్య, హుస్సేన్, జయరాం, సువర్ణ, పావని, వైష్ణవి, విజయ్ కుమార్, పోస్టల్ ఉద్యోగులు గోపాల్ నాయక్, రమణ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి

శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 23 నుంచి మార్చి 5 వరకు రాయచోటి పట్టణంలోని గాంధీ బజార్‌లో ఉన్న వీరభద్ర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఆలయ ఇఒ రమణ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో మంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 191913 చెక్కును సంబేపల్లి పట్టణానికి చెందిన యండపల్లి శ్వేత అనే బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందన్నారు. పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే ముఖ్యమంత్రి నారాచంద్ర బాబునాయుడు కలకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని ఆయనకు ప్రజలందరూ ఆశీస్సులు అందించాలని ఆకాంక్షించారు.

సబ్సిడీ రుణాలకు ముగిసిన ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మున్సిపాలిటీ, మండల పరిధిలో సబ్సిడీ రుణాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలు గురువారంతో ముగిశాయి. ఎంపిడిఒ కార్యాలయంలో మదనపల్లె మండలంలోని పలువురు నిరుద్యోగ యువతీ యువకులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉదయం అత్యధిక సంఖ్యలో లబ్ధిదారులు రావడంతో ఓ దశలో ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఎంపిడిఒ పోలీసుల సహకారంతో పరిస్థితిని చక్కదిద్దడంతో లబ్ధిదారులందరికీ బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిధిలో 94 యూనిట్లు మంజూరు చేయాల్సి ఉండగా 12 బ్యాంకులతో సమన్వయం చేసుకోవడం జరిగిందని ఎంపిడిఒ తాజ్ మస్రూర్ తెలిపారు. లబ్ధిదారులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకోవడంతో గురువారం 642 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో బుధవారం 1 నుంచి 15 వార్డులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 576 మంది హాజరయ్యారు. గురువారం 16 నుంచి 35 వార్డులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 360 మంది హాజరయ్యారు. 130 యూనిట్లకు గాను 22 బ్యాంకులతో సమన్వయం చేసుకున్నట్లు మున్సిపల్ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బ్యాంకు అధికారులు దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి త్వరలోనే రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

అవగాహనతోనే భవితకు పునాది

ప్రజాశక్తి-పీలేరు

చిన్నారుల అక్షరాస్యతకు పూర్వ ప్రాథమిక పాఠశాలల్లోనే పునాది వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి షమీవుల్లా తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలకు 120 రోజుల సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా పీలేరు మండల అంగన్వాడీలకు మొదటదశ మొదటి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి వై.లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి పరిశీలకులుగా సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి షమీ వుల్లాఖాన్ హాజరయ్యారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో పునాదిగా అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం బాగా అభివృద్ధి చెందితే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో సమస్యల పరిష్కార భావన పెంపొందించాలని, ప్రతి విద్యార్థిలో ఆత్మస్థైర్యాన్ని మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసు మధ్యలోనే పెంపొందించి వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని, ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని చెప్పారు. దానికి అందరూ తాము శిక్షణలో నేర్చుకున్న విషయాలను అంగన్వాడీ కేంద్రాల్లో అమలుపరచాలని సూచించారు. కోర్సు యొక్క ప్రాముఖ్యతను, పూర్వ ప్రాథమిక విద్య యొక్క ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజి నటరాజన్, రీసోర్స్ పర్సన్స్‌గా ఉపాధ్యాయులు ఓబుల్‌రెడ్డి, సురేష్ బాబు, రేఖ, సూపర్వైజర్లు స్వరూప, అక్కయ్య, స్వర్ణ, ఉమ, సిఆర్‌పి జలకనూరి మురళీధర్ రాజు, పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

పేదరిక నిర్మూలన-పి4 సర్వేను పకడ్బందీంగా నిర్వహించాలని, వాట్సాప్ పరిపాలన ద్వారా ప్రజలకు అత్యంత చేరువలో సేవలు ఉండాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎపిపిఎస్‌సి గ్రూప్ 2 పరీక్ష, పేదరిక నిర్మూలన- పి4 సర్వే, ఇంటర్ పరీక్షలు, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, వాట్సాప్ పరిపాలన, ఎమ్మెస్ఎంఇ సర్వే, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ ఉమ్మడి 13 జిల్లాల కేంద్రాలలో నిర్వహించే గ్రూపు- 2 పరీక్షను ఎపిపిఎస్‌సితో సమన్వయం చేసుకొని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ గురించి మాట్లాడుతూ అన్న క్యాంటీన్లు, ఆర్‌టిసి బస్టేషన్ల నిర్వహణ ముఖ్యమైన దేవాలయాల నిర్వహణ, పింఛన్ల పంపిణీ, తదితర అంశాలపై లబ్ధిదారుల నుంచి ఐవిఆర్ఎస్ ద్వారా తీసుకున్న అభిప్రాయాలపై సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 26 జిల్లాలలో ఏ లోపం లేకుండా ఇంటర్ పరీక్షల నిర్వహణ జరగాలని ఆదేశించారు. వాట్సాప్ పరిపాలనపై మాట్లాడుతూ త్వరలో వీలైనన్ని ఎక్కువ సేవలను వాట్సాప్ ద్వారా ప్రజలకు అందించేందుకు సన్నద్ధం అవ్వాలని, ఇప్పటికే ఆర్‌టిసి, దేవాదాయ శాఖ, విద్యాశాఖ తదితర శాఖల వారి సేవలను వాట్సాప్ ద్వారా ప్రజలకు అందిస్తున్నామని వీటిలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎం బి పార్కుల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 27 వేలకు పైగా విద్యార్థులు రాయబోతున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని రకాలుగా సన్నద్ధమవ్వాలని పేర్కొన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారిని, డిఆర్‌ఒను, పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. పి4 సర్వేపై మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే గ్రామ వార్డు సచివాలయ సిబ్బందికి, మున్సిపల్ శాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పూర్తయినందున ఎటువంటి లోపాలు లేకుండా సర్వే చేయాలని, మార్చి 2 లోపల సర్వే పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ మధుసూదన్ రావు, సిపిఒ వెంకట్, డిఇఒసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ వాసు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు రెండు విడతల్లో శిక్షణ : సిడిపిఒ



అంగన్వాడీ శిక్షణ కారక్రమాన్ని పర్యవేక్షిస్తున్న సిడిపిఒ సుజాత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంగన్వాడీ కార్యకర్తలకు రెండు విడతల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ సుజాత తెలిపారు. మదనపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మండలంలోని జ్ఞానజ్యోతి ట్రైనింగ్ సెంటర్ నుండి అంగన్వాడీ కార్యకర్తలకు ఈ నెల 18 నుండి 20వ తేదీ వరకు మొదటి విడత, 22, 24, 25వ తేదీల్లో రెండవ విడత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలకు 120 రోజులపాటు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలియజేశారు. ఈ శిక్షణ పూర్తయిన తర్వాత అంగన్వాడీ కార్యకర్తలకు ధ్రువీకరణ పత్రాలను అందిస్తామన్నారు. క్రమశిక్షణతో పిల్లలను తీర్చిదిద్దడమే ఈ ట్రైనింగ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మదనపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కెఆర్‌పి వై.రవీంద్రరెడ్డి, డిఆర్‌పి కె.చంద్రకాంత, నరసింహులు, ఎ.రమణమ్మ, కె.విజయ్ కుమార్ శిక్షణ కార్యక్రమంలో భాగస్వాములై నిర్వహిస్తారన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు వారి పరిధిలో ఉన్న పిల్లలను ప్రీస్కూల్ పిపి వన్, పిపిటు పుస్తకాల ద్వారా పిల్లలకు స్కూల్ కార్యక్రమాలతో పిల్లలను ఉత్తేజపరిచి వారిని తీర్చి రుద్దాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ ట్రైనింగులో వారు నేర్చుకున్నది పిల్లలకు తెలియజేయాలని కమిటీల ద్వారా తల్లులకు తెలియజేయాలని, అంగన్వాడీ కార్యకర్త సేవల్ని బలోపేతం చేయాలని తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సోషల్ నెట్‌వర్క్‌పై 'సిఎన్‌ఆర్' విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు సిఎన్‌ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చెన్నై ఫేస్ ప్రెప్ కంపెనీ వారు లింక్డ్‌ఇన్ సోషల్ నెట్‌వర్క్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం కళాశాల ప్రాంగణంలో ఫేస్ ప్రెప్ కంపెనీ ట్రైనర్ హరి నారాయణ్ డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు లింక్డ్ ఇన్‌పైన ప్రీమియం అకౌంట్ ఎలా క్రియేట్ చేసుకోవాలి, ప్రీమియం అకౌంట్ ద్వారా స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు ఎలా నేర్చుకోవాలి, జాబ్ కెరీర్‌కి లింక్డ్ ఇన్ ఎలా ఉపయోగపడతాదని ఈ ప్రోగ్రాం ద్వారా తెలియపరిచారు. ఈ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులకు ఉచితంగా 3 నెలల ప్రీమియం అకౌంట్ క్రియేట్ చేసి ఇచ్చారు. సహజంగా నెల రోజులపాటు లింక్డ్ ఇన్ ప్రొఫైల్ ఉపయోగించాలంటే రూ.2వేలు ఖర్చు అవుతుందని తెలియజేశారు. అలాంటిది ఫేస్ ప్రెప్ కంపెనీ లింక్డ్ ఇన్ భాగస్వామిగా 3 నెలలకు అయ్యే ఖర్చు సుమారు రూ.6వేలు విద్యార్థులకు ఉచిత సబ్‌స్క్రిప్షన్ ఇవ్వడంతో దాదాపు 170 కోర్సులు లింక్డ్ ఇన్ ద్వారా ఉచితంగా నేర్చుకొనే అవకాశం కల్పించారని చెప్పారు. కళాశాల అధినేత సి.విజయ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మంచి ఉద్యోగం సాధించడానికి లింక్డ్ ఇన్ అనేది ప్రథమ స్థానంలో వుందని, ఈ సోషల్ నెట్వర్క్ ద్వారా చాలా మల్టీ నేషనల్ కంపెనీల హెచ్‌ఆర్ మేనేజర్లు అడ్వాన్స్ స్కిల్ ఉన్న విద్యార్థుల కొరకు లింక్డ్ ఇన్ అనేది ఆశ్రయిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు నేర్చుకునే ప్రతి స్కిల్‌ని లింక్డ్ ఇన్ ప్రొఫైల్‌లో నమోదు చేసుకోవడం వలన మంచి వేతనంతో కూడుకున్న ఉద్యోగాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

మిర్చి రైతులపై జగన్‌ది కపటప్రేమ : ఆర్‌జె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మిర్చి రైతులపై మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కపటప్రేమ చూపిస్తున్నారని, ఆయన డ్రామాలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ విమర్శించారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన రాజకీయ ఉనికి కోసం జగన్ కొత్త నాటకాలకు తెరతీస్తు న్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి రైతులతో మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తాను ముఖ్య మంత్రిగా ఉన్న ఐదేళ్లలో ఏరోజు మిర్చి రైతులను పట్టించుకున్న పాపానపోని జగన్ ఇప్పుడు మాత్రం రైతుల మీద కపటప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ వ్యాప్తంగా మిర్చి ధరలు పడిపోవడంతో ఎంపీ లావు కృష్ణదేవ రాయలు ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాసి విర్చి రైతులను ఆదుకోవాలని కోరారనే విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల్లో చిత్తుగా ఓడినా జగన్‌కు బుద్ధి రాలేదని, ఇప్పటికైనా తీరు మార్చుకొని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు.

నేడు, రేపు 'మిట్స్'లో అశ్వ-2025

ప్రజాశక్తి-మదనపల్లె: మిట్స్ కళాశాలలో అశ్వ-2025 జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ ఈ నెల 21, 22వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలు కళాశాల అశ్వ వెబ్ సైట్ www.ashv2k.in లేదా www.mits.ac.inలో పొందుపరిచామని తెలిపారు. ఈ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ వివరాలు, పోటీలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఏటా సినీ ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అలరిస్తారన్నారు. 21న నేపథ్య గాయకులు సమీరా భరద్వాజ్, దీపు, హారిక, నారాయణ్ నేపథ్య గాయకులు, 22వ తేదీన డిజె టిల్లు హీరోయిన్ నేహాశెట్టి పాల్గొంటారని పేర్కొన్నారు.

బిసిల సంక్షేమానికి నిరంతరం కృషి

ప్రజాశక్తి-రాయచోటి: జిల్లాలోని బిసిల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షులు పద్మ యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఆమె బిసి సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో పలువురుని జిల్లా కార్యవర్గంలో నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణ యాదవ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నాగేశ్వర, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగేంద్రబాబు, జిల్లా సెక్రటరీగా మల్లికార్జున, జిల్లా మహిళా సెక్రటరీగా లక్ష్మీకళ, రాయచోటి డివిజన్ ప్రెసిడెంట్‌గా నాగరాజ, జనరల్ సెక్రటరీగా జయరాం, వైస్ ప్రెసిడెంట్‌గా రమణ తాలూకా సెక్రెటరీగా పదిలం లలిత నరసింహనాయుడులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో బిసిలను ఏకతాటిపై తీసుకువచ్చి రాజ్యాంగం వైపు అడుగులు వేసే విధంగా సమిష్టిగా కృషి చేస్తామన్నారు. బిసిలకు రాజ్యాధికారం రావాలంటే బిసిలంతా సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



నూతన కమిటీ సభ్యులతో పద్మ యాదవ్

అధికారులు పీలేరు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -పీలేరు

పీలేరు గ్రామపంచాయతీ వైసిపి పాలకవర్గం, అధికారుల మధ్య సమన్వయ లోపం ఫలితంగా అభివృద్ధి కుంటుపబడుతోందని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని టిడిపి నాయకులు తెలిపారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పీలేరు గ్రామ పంచాయతీ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ఇక్కడ జరిగిన అవకతకలను ప్రశ్నించకుండా, పీలేరు అభివృద్ధికి ఎలాంటి ఆటంకం కలగకూడదన్న ఆలోచనాతో గత ప్రభుత్వంలో వారు నియమించుకున్న గ్రామ సిబ్బందిని కూడా తొలగించకుండా సహకరిస్తున్నామని పేర్కొన్నారు. వారిలో మార్పును ఆశిస్తూ, మంచి ఆలోచనలతో ముందుకు వెళ్లాలని సూచిస్తూ కొంతకాలం తాము వేచి చూశామని తెలిపారు. వారు అధికారంలో ఉన్నప్పుడు అనేక దుర్వినియోగాలకు పాల్పడ్డారని, గ్రామ పంచాయతీ ఇంటి పన్నులు, ప్లాన్ అప్రూవల్స్ కోసం చలానా కట్టకుండానే ప్రొసీడింగ్ ఇచ్చేసి దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దీనిపై ఉన్నత అధికారులు బృందం విచారణ చేపట్టి సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేశారని గుర్తు చేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామ పంచాయతీలో సమావేశాలు నిర్వహించకుండా ప్లాట్ అప్రూవల్స్, అభివృద్ధి పనులు అజెండా లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పాలక మండలి ప్రమేయం లేకుండా సమావేశాలు జరుపుకోడానికి జిల్లా ఉన్నతాధికారులు తగిన అనుమతులు ఇవ్వాలని వారు కోరారు. అలాగే ఇటీవల అధికారుల విచారణలో వెలుగు చూసిన అవినీతి సొమ్మును కూడా తిరిగి రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాజంపేట తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోటపల్లి బాబురెడ్డి, నాయకులు, పురం రామ్మూర్తి, పశువులేటి లక్ష్మీకర, పోలిశెట్టి సురేంద్ర, శ్రీనాథరెడ్డి, నల్లారి రియాజ్, లడ్డు జాఫర్, కంచు సూరి, వసంతాల రాజా పాల్గొన్నారు.



మందులను అందిస్తున్న ఎఎన్ఎం ఆబీదా

ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ ప్రత్యూష పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ ప్రత్యూష ఆదేశాల మేరకు చల్లావారిపల్లెలో గురువారం ముష్మారు ఎఎన్ఎం ఆబీదా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని అన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆరోగ్యానికి మేలు చేసే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు వంటి ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు బిపి పరిశీలించి తగు సూచనలు చేశారు. బిపి ఉన్న వ్యక్తులు ఆహారంలో ఉప్పు శాతాన్ని తగ్గించాలన్నారు. అధికంగా మాంసాహారానికి అలవాటు పడవద్దు అన్నారు. ప్రజలకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఆబీద, ఆశా కార్యకర్త, ప్రజలు పాల్గొన్నారు.

కాసుల గుట్టకు శాశ్వత రహదారి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-నందలూరు

మండలం పాటూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్ర పాపయ్యగారిపల్లె గ్రామ సమీపంలో కాసుల గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి శాశ్వత రహదారి ఏర్పాటు చేయాలని, పాటూరు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలే కాకుండా ఆలయాన్ని సందర్శించుకుంటున్న భక్తులు కోరుకుంటున్నారు. దర్శనానికి వెళ్లే రోడ్డు సరిగా లేకపోవడం వల్ల వర్షాకాలంలో నీటితో బురదమయమై భక్తులు, స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రోడ్డు వేసేందుకు కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.



మాట్లాడుతున్న కుంపినిపురం గ్రామస్తులు

అక్రమంగా గ్రామ కంఠం ఆన్‌లైన్

ప్రజాశక్తి-నందలూరు

దాదాపు 40 సంవత్సరాలుగా ఆ స్థలంలో వివిధ కులాల చెందిన వారిమి జీవిస్తున్నామని కొందరు వచ్చి ఆ స్థలం మాదని, మా పేరుతో రిజిస్టర్ అయిందని ఖాళీ చేయాలని మమ్మల్ని బెదిరిస్తున్నారని మండలంలోని కుంపిని పురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా కుంపిణీపురం గ్రామస్తులు మాట్లాడుతూ మండలంలోని నూకినేని పల్లె గ్రామపంచాయతీ సర్వేనెంబర్ 66/13 లో ఒక ఎకరా 60 సెంట్లు గ్రామ కంఠం స్థలం ఉందని అన్నారు. అందులో దాదాపు 20 ఇళ్లతో పాటు కొన్ని పాడుబడిన ఇళ్లు, ప్రభుత్వ రోడ్డు, చేతి బోరు ఉన్నాయని తెలిపారు. గతంలో ఆ స్థలంలోనే కుమ్మరి వారు కుండలు చేసుకుని అమ్మేవారిని అన్నారు. ప్రభుత్వ రికార్డులలో గ్రామ కంఠంగా ఉన్న స్థలాన్ని కొంతమంది వ్యక్తులు తప్పుడు రికార్డులను సృష్టించి, రెవెన్యూ వారిని మోసగించి వారి పేరుతో ఆన్‌లైన్ చేసుకున్నారని అన్నారు. గత ఏడాది డిసెంబర్ నెలలో ఆ స్థలాన్ని రిజిస్టర్ చేసుకున్నారని అన్నారు. ఇప్పుడు వారు దౌర్జన్యంగా తాము నివసిస్తున్న స్థలాలలో జెసిబి లు పెట్టి చదును చేస్తూ తమను ఖాళీ చేయమని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

2న బోలమల్లేశ్వరస్వామి కల్యాణం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని చింతకాయలపల్లి గ్రామంలోని బోల మల్లేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ కామాక్షి సమేత బోల మల్లేశ్వరస్వామి కల్యా ణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త చింతకాయల గంగినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 2న ఉదయం అభిషేకాలు, పూజా కార్యక్రమాల అనంతరం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.మధ్యాహ్నం 12 గంటలకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం, రాత్రి 9 గంటలకు ఆర్కెస్ట్రా నిర్వహించనున్నట్లు తెలిపారు.ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేడ మల్లికార్జునరెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, వైసిపి కన్వీనర్ సిద్ధవరం గోపిరెడ్డి, సర్పంచ్ గీతాల నరసింహారెడ్డి హాజరవుతారన్నారు.

బండలాగుడు పోటీలు

వృషబాల బండలాగుడు పోటీలకు పలు ప్రాంతాల నుంచి ఎద్దులు రానున్నాయి. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి రూ.30వేలు రెండవ బహుమతి సిద్ధవరం గోపిరెడ్డి రూ.20 వేలు, మూడవ బహుమతి వీరపురెడ్డి హర్షవర్ధన్ రెడ్డి రూ.10 వేలు అందివ్వనున్నారని చెప్పారు. నాలుగవ బహుమతి దేబాకు జయరామయ్య రూ.5 వేలు, ఐదవ బహుమతి టంగుటూరు చిన్న పుల్లయ్య రూ.3 వేలు నగదు బహుమతి అందిస్తారని ఆలయ ధర్మకర్త గంగి నాయుడు తెలిపారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే 'గాలివీటి' జయంతి

ప్రజాశక్తి-వీరబల్లి



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి

పూర్వపు లక్కిరెడ్డిపల్లి నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు కీ.శే. గాలి వీటి విశ్వనాథరెడ్డి 97వ జయంతి వేడుకలను గురువారం ఘన ంగా నిర్వహి ంచారు. మండల కేంద్రంలో ఆయన స్వగృహంలో కుమారులు వైసిపి నాయకులు మాజీ ఎంపిపి గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, సొసైటీ సభ్యులు రామ కృష్ణారెడ్డి, కాసిం పీరా, సంఘంవాండ్లపల్లి వైసిపి నాయకులు నరసింహులు, సుబ్బరామరాజు, కో-ఆప్షన్ సభ్యులు, రెడ్డప్ప రెడ్డి, తారకేశ్వర్ రెడ్డి, రామ చంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

ప్రజాశక్తి-కలకడ



మండలంలోని దేవళం పేటలో వేసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ ధర్మకర్త త్రికోటం రవీంద్రశర్మ తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగం గా గురు వారం గణపతి పూజ, అంకురార్పణ, హోమం, ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహిం చినట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : 'చమర్తి'

ప్రజాశక్తి-సుండుపల్లి



జగన్‌మోహన్‌రాజుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామప్రజలు

ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురువారం తిమ్మసముద్రం కప్పాలో సిసి రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.సిఎం చంద్రబాబు ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా రాజంపేట నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా పని చేస్తు న్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీరు, వీధిదీపాలు, సిమెంటు రోడ్లు తదితర మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పారు. గ్రామాల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుక వస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను సిఎం చంద్రబాబు ఖచ్చితంగా అమలు చేసి తీరుతారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని అన్నారు. అనం తరం జగన్‌మోహన్‌రాజు సమక్షంలో మాజీ జడ్‌పిటిసి హాకీమ్ టిడిపిలో చేరారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



గోపిదిన్నె గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని గోపిదిన్నె, బోడిరెడ్డికోట గ్రామాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి పర్యటించారు. గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని చెప్పారు.

బి.కొత్తకోట : కూటమి ప్రభుత్వ మోసపూరిత హామీలు, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి యువనాయకుడు కంచి కళ్యాణ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సూచించారు. ఎమ్మెల్యేని గురువారం కళ్యాణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చి, సూపర్ సిక్స్ పథకాలు ఏవి అమలు చేయకుండా మీనవేషాలు వేస్తోందన్నారు. ఈ విషయాలన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే తెలిపారు. వైసిపి పాలనలో మాజీ సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలు చేయలేమని, ప్రజలు అర్థం చేసుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం అప్పులు పెంచేసి ప్రజలపై భారం పెంచుతున్నారే తప్ప, రైతులకు గానీ, ప్రజలను గాని ఎటువంటి ప్రయోజనం లేదని అన్నారు. ప్రజలకు కరెంట్ షాక్ కొట్టే విధంగా విద్యుత్ బిల్లుల మోత మోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని, ఈ విష యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడాను వివరిం చాలన్నారు. కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసకెళ్ళాలని దిశా నిర్దేశం చేశారు. భవిష్యత్తు వైసిపిదేనని అన్నారు. ఈ తప్పుడు హామీల కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించవచ్చు : ఎఓ

ప్రజాశక్తి-పుల్లంపేట



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎఓ, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శి

మండల పరిధిలోని రెడ్డిపల్లి, రంగంపల్లి, టి.కమ్మపల్లి, అనంతపల్లి మొదలగు గ్రామపంచా యతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంద ర్శించి పంచాయతీ కార్యదర్శిలకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఎఓ మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావడానికి చర్యలు చేపట్టవలసిందిగా పంచాయతీ కార్యదర్శులకు తెలిపామని చెప్పారు. గ్రామాలలో ఎక్కడా చెత్త దిబ్బలు లేకుండా చేయాలని తెలియజేశారు. ప్రతిరోజూ గ్రీన్ అంబాసిటర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి తడి చెత్త, పొడి చెత్త రూపంలో సేకరించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలోకి తరలించి తడి చెత్త ద్వారా వర్మి కంపోస్టు ఎరువు తయారు చేయాలని అన్నారు. పొడి చెత్తను అమ్మడం ద్వారా గ్రామపంచాయతీకి ఆదాయం చేకూర్చుందని పేర్కొన్నారు. చెత్త నుంచి సేకరించిన వర్మి కంపోస్ట్ తయారుచేసి రైతులకు అందిస్తామని, రైతులు ఈ ఎరువులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, వేమయ్య, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు



పాలకొండల్లో అడవిని నిప్పు

ప్రజాశక్తి-రామాపురం

అడవికి నిప్పు పెట్టడం వల్ల మానవ మనుగడకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిసి కొంత మంది నిప్పు పెట్టడం పరిపాటిగా మారింది. మండలంలో విస్తరించి ఉన్న పాలకొండలో వేసవి సీజన్ ప్రారంభంలో అడవికి నిప్పు పెట్టడం పరిపాటిగా మారింది. అటవీ శాఖ అధికారులు ఈ ప్రమాదాన్ని నివారించడంలో విఫలమవుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. పాలకొండ సమీపంలోని గ్రామాలలో ప్రజలకు చైతన్య పరచడంతో అధికారులు తగి చర్యలు తీసుకోవడం లేదని చెబుతున్నారు. ప్రతి ఏడాది వేసవి సీజన్ ప్రారంభంలో అటవీ శాఖ అధికారులు గ్రామాలను పర్యటించి అడవికి నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాలను తెలియపరచి ప్రజలను జాగ్రత్తపరిస్తే ఈ ప్రమాదాలను నివారించవచ్చని అంటున్నారు. అడవికి నిప్పు పెట్టడం వలన వర్షాలు రాక కరువు వస్తుందని, అడవిలో జీవిస్తున్న వన్యప్రాణులు మృత్యువాత పడతాయని,ఔషధ మొక్కలు అంతరించి పోయే ప్రమాదం ఉందని అన్నారు. ఎంతో విలువైన అడవి సంపద బుగ్గి పాలవుతుందని అంటున్నారు. అటవీ శాఖ అధికారులు ప్రజలలో చైతన్యం తీసుకొచ్చి అడవిని కాపాడవలసినబాధ్యత ఎంతైనా ఉందని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు

ప్రజాశక్తి-చిన్నమండెం



ప్రకృతి వ్యవసాయ కూరగాయాల స్టాల్‌ను ప్రారంభిస్తున్న చందురెడ్డి

మండల కేంద్రం చిన్నమండెంలోని స్టేట్ బ్యాంకు పక్కన గురువారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటల ఉత్పత్తులను మోడల్ మండల్ టీం లీడ్ చందురెడ్డి, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ పద్మావతి, యటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎపిసిఎన్ఎఫ్ వనరుల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన తాజా కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యం పరమైనటువంటి ఉత్పత్తులు పొడులు, నాణ్యంగా మంచి ప్యాకింగ్ చేసి వినియోగదారులైన ప్రతి కుటుంబానికి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులని అందించాలనే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభించామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందిస్తూ మంచి పౌష్టికర ఆహార ఉత్పత్తులను అందించే కార్యక్రమం డిపిఎం ప్రవీణ్ కుమార్ ఆఆధ్వర్యంలో చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలోవ్యాల్యూ చైన్ చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌ఛార్జి రెడ్డి కళావతి,యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం : ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి-కలకడ



ఎస్ఐతో మాట్లాడుతున్న ఆర్‌టిసి డిఎం నిర్మల

ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చడమే మా బాధ్యతని పీలేరు డిపో మేనేజర్ నిర్మల పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కలకడ ఆర్‌టిసి బస్టాండ్‌ను పరిశీలించి తనిఖీలు నిర్వహించాలి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణలో ఆటోలు, పూల అంగళ్లు ఉంచడం వల్ల ఆర్‌టిసి బస్సులకు ఆటంకం ఏర్పడుతుందని ఇందుకోసం తాము చర్యలు చేపడతామని తెలిపారు.ఈనెల 27న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరి మహోత్సవానికి సుమారు పది బస్సులను నడపడం జరుగుతుందని తెలిపారు. ఇందుకోసం ఆటోలను ప్రయాణించకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ రామాంజనేయులును కోరినట్లు తెలిపారు. జరి మహోత్సవానికి కి ఆటోలలో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని ఇందుకోసం వాటిని నియంత్రించి ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించేలా చర్య తీసుకునేందుకు తమకు సహకరించాలని ఎస్ఐని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐ సుబ్బమ్మ , ఎఎంఎఫ్ హరినాథ, ఆర్‌టిసి సిబ్బంది, పాల్గొన్నారు.

రేపు ఐటిఐలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

తంబళ్లపల్లె, అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, మరియు సీడాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం టిఎన్.వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటిఐ కళాశాల, తంబళ్లపల్లెలో జాబ్ మేళా నిర్వహించబడుతుందని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డి. నాగార్జున తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, మెడ్ పల్స్, విభాగాలకు చెందిన, 18 నుంచి35 సంవత్సరాలు వయసు గల నిరుద్యోగ యువత తమ బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫోటోతో ఉదయం 9.30కు నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగవకాశం పొందాలని కోరారు. మరిన్ని వివరాలకు 9618655759 సంప్రదించాలని తెలిపారు.



ఎంపిడిఒకు లేఖను అందిస్తున్న ఎంపిటిసిలు

ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట ఎంపిపి లక్ష్మీనరసమ్మపై ఎంపిటిసిలు అవిశ్వాస తీర్మానం పెట్టాలని లిఖితపూర్వకంగా స్థానిక ఎంపిడిఒ శంకరయ్యకు లేఖ ఇచ్చారు. ఫిర్యాదులో ఎంపిపి నియంతృత్వ పోకడలతో ఇతర ప్రాదేశిక సభ్యులు ప్రతిపాదనలను ఖాతరు చేయడం లేదన్నారు. మండల అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలిగించే రీతిలో ప్రవర్తించడం వలన ఆమెపై నమ్మకం సన్నగిల్లిందన్నారు. జిఒ ఎంఎస్ నెంబర్-200 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 9 మంది సభ్యులు ఏకగ్రీవంగా మండల పరిషత్ అధ్యక్షురాలిపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించామని అన్నారు. అవిశ్వాస తీర్మానంపై ఎంపిడిఒను విచారించగా ఎంపిటిసిలు లేఖ ఇచ్చిన మాట వాస్తవమేనని, ఈ అంశాన్ని వెంటనే పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

పి4 సర్వేకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

పి4 సర్వేకి ప్రజలు సహకరించాలని ఎంపిడిఒ నూర్జహాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పి4 పబ్లిక్, ప్రయివేట్ పీపుల్ పాట్నర్‌షిప్ మోడల్‌లో భాగంగా అత్యంత నిరుపేదలను గుర్తించుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందిన పి4 సర్వే ఈనెల 20 నుంచి మార్చి 2వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది చేత నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సర్వే లో అత్యంత వెనుకబడిన 20 శాతం మందిని గుర్తించి వారికి మెరుగైన సహాయం చేయుట కోసర్ట ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ సర్వే సకాలంలో పూర్తి చేయుట కొరకు సచివాలయ సిబ్బందికి, ప్రజలు సహకరించవలనని ఆమె కోరారు.

క్రైం కార్నర్



డ్రంక్ అండ్ డ్రైవ్‌లో శిక్ష పడిన నిందితులతో పోలీసులు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

ప్రజాశక్తి-కలకడ

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికీ జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండల సరిహద్దులో గతంలో ఎస్ఐ తన డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న వ్యక్తులను పరీక్షలు నిర్వహించగా రాయచోటికి చెందిన మహబూబ్ బాషా, మహాల్‌కు చెందిన పెద్ద రెడ్డప్ప అనే ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు. గురువారం కోర్టులో విచారణ నిర్వహించిన వాల్మీకిపురం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గురు అరవిందు డ్రంక్ అండ్ డ్రైవ్‌కు కారకులైన ఇద్దరికి ఒక్కోక్కరి రూ.16 వేలుచొప్పున రూ.32వేలు జరిమానా, వారం రోజులు పాటు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు ముత్యాలు, యూనస్ ఇమ్రాన్, సుబ్బయ్య పాల్గొన్నట్లు తెలిపారు.

ఏడుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-రామసముద్రం

పేకాట స్థావరాలపై దాడులు చేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.4010నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. తమకు రాబడిన సమాచారం మేరకు మండలంలోని మానేవారిపల్లి పంచాయతీ నాగనపల్లి సమీపంలో ఏడుగురు పేకాట రాయుళ్లు పేకాట ఆడుతుండగా తమ సిబ్బందితో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ. 4010 నగదును సీజ్ చేసి నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం : కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట



సోనియా(ఫైల్ ఫొటో)

ఓ వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలో జరిగింది. మండల పరిధిలోని బడికాయలపల్లి గ్రామానికి చెందిన జి.రెడ్డి బాషా అనే వ్యక్తి తన భార్య సోనియా ఈనెల 16వ తేదీ రాత్రి సుమారు 12 గంటల నుండి ఒంటి గంట మధ్య సమయంలో ఇంటిలో నుంచి ఎక్కడికో వెళ్లిపోయిందని పోలీ సులకు ఫిర్యాదు చేశారు. ఇంటికి తిరిగి రానందు చుట్టుపక్కల ప్రాంతాలు, బం ధువులు ఇండ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదన్నారు. రెడ్డిబాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెడ్డిబాషా అత్త గారి ఊరు కర్ణాటక రాష్ట్రంలోని చిక్కబల్లాపూర్ జిల్లా, శిలగట్ట తాలూకా, గం జికుంటపల్లికి చెందిన బావాజాన్ అలియాస్ పుత్తు అనే వ్యక్తి మీద అనుమానంగా ఉందని తన ఫిర్యాదులో తెలిపాడని తెలిపారు. రెడ్డిబాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటుసారా విక్రయస్థావరంపై గురువారం నిమ్మనపల్లి పోలీసులు దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ సి.తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు. .గురువారం ఉదయం రెడ్డివారిపల్లి పంచాయతీ పెట్టావాండ్లపల్లి సమీపంలో పెట్టావాండ్లపల్లెకు చెందిన షేక్ మహమ్మద్ జుబేర్ నాటుసారాను తీసుకువచ్చి ప్రజలకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పోలీస్ సిబ్బంది దాడులు చేసి అతని వద్ద నుంచి రూ.2వేలు విలువగల పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా కలిగి పోలీసులకు పట్టుబడ్డ నిందితుని పై కేసు నమోదు చేసి అతనిని రిమాండు కు పంపినట్లు తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లుఎర్కొన్నారు. నాటుసారా విక్రయాలపై పోలీసులకు ప్రజలు సమాచారం అందించాలని కోరారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:** జూదం ఆడుతున్న పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. స్థానిక ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..మండలంలోని కదిరాయ చెరువు పంచాయతీ వడ్డేపల్లి సమీపంలో ఉన్న ముళ్లపదలలో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించడం తెలిపారు.ఈ దాడులలో పేకాటాడుతున్న వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.3,270లు నగదును స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.ఈ దాడులలో సిబ్బంది లక్ష్మినారాయణ, కరుణాకర, రమేష్, నాగిరెడ్డి, డ్రైవర్ రమేష్‌బాబు పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని నల్ల తిమ్మయ్యగారిపల్లి గ్రామంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు గురువారం తన సిబ్బందితో దాడులు నిర్వహించి అక్రమంగా దాచి ఉంచిన 18 మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం కలిగిన పల్లె నరసింహారెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.